క్లుప్తంగా

తునికి ఆలయంలో పూజలు



తునికి నల్లపోచమ్మదేవి దర్శనం చేసుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేష్, విఘ్నేష్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

పోటెత్తిన భక్తులు



చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ మేరకు ఆదివారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ మృతి

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ కర్నల భూదేవి శనివారం మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం జరిగిన అంత్యక్రియల్లో మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మల్లప్ప, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డాకన్నగారి మధుసూదన్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు సోములు, మాజీ సర్పంచ్‌లు గురుమూర్తిగౌడ్, భూమయ్య, రాజేందర్‌రావు, వెంకోబ, కిషన్, మెదక్ వైద్యులు పెంటగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..



నగదు అందిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొద్మట్‌పల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కంకర బీరప్ప భార్య విఠమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు రాజనరసింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిషమ్మ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సహాయంగా అంత్యక్రియలకు రూ.15వేలు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకరప్ప రూ.11వేలు, గ్రామపెద్దలు, యువకులు అందరు కలిసి రూ.37300ల నగదును అందజేశారు. అనంతరం దాతల సహకారంతోనే అంత్యక్రియలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భూషణ్, రవిశంకర్, అంజయ్య, గోపాల్, విఠల్, శంకర్, రమేష్, చెన్నయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


లోవోల్టేజీ సమస్యను తీర్చాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని తొగిటలో లోవోల్టేజీ సమస్యతో ఇంట్లో ఫ్యాన్లు, టీవీలు కాలిపోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ఆదివారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌కు లోవోల్టేజీ సమస్యపై వినతిపత్రం అందజేశారు. కొంత కాలంగా లోవోల్టేజీ, హైవోల్టేజీ వస్తుండడంతో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయి ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

ఆగుతూ..సాగుతూ!



తూప్రాన్‌-వెంకటరత్నాపూర్ గ్రామాల మధ్య ఉన్న హల్దీవాగుపై నిలిచిన వంతెన నిర్మాణ పనులు

తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న పనులు

- ఏళ్లతరబడి పూర్తికాని వంతెన పనులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

తూప్రాన్: స్థానిక డివిజన్ పరిధిలోని వెంకటరత్నాపూర్ హల్దీవాగుపై గత తొమ్మిదేళ్ల క్రితం చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ఆగుతూ..సాగుతూ నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు గ్రామానికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ అసంపూర్తిగా వంతెన నిర్మాణ పనులు వదిలేయడంతో ఇబ్బందులు తప్పడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తూప్రాన్ డివిజన్ కేంద్రం కావడంతో నిత్యం ఏ అవసరం వచ్చిన అక్కడికే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం తమ గ్రామం మీదుగా ఇస్లాంపూర్, ఇస్లాంపూర్ తండా, దతార్‌పల్లి గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. వర్షాకాలంలో కనీసం నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు ప్రజలతో పాటు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు, పొలాలకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6 కోట్ల నిధులు మంజూరు..

మాజీ మంత్రి హరీష్‌రావు గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి అప్పట్లో హల్దీవాగుపై వంతెన నిర్మాణం కోసం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. సదరు కాంట్రాక్టర్ సైతం నాసిరకంగా నిర్మాణ పనులు చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే..

హల్దీవాగుపై వంతెన నిర్మాణంలో జాప్యం నెలకొంది వాస్తవమే. వంతెన నిర్మాణానికి అధికారులు తొలుత రూ.7 కోట్లు కేటాయించారు. కానీ ఆ తర్వాత రీడిజైన్ చేసి రూ.6 కోట్లకు ఉన్నతాధికారులు కుదించారు. కాంట్రాక్టర్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికే నోటీసులు అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– మధుసూధన్, ఏఈ, పీఆర్, తూప్రాన్

త్వరగా పూర్తిచేయాలి



గ్రామస్తుల సౌకర్యం కోసం నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించడంలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాడు. పనులు సక్రమంగా చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– రాజేందర్‌రెడ్డి, వెంకటరత్నాపూర్

పనులు నిలిచిపోయాయి



వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పనులు జరగడంలేదు. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. కానీ ఇప్పటికీ పనులు పూర్తి చేయడంలేదు. అసంపూర్తి పనులతో నిత్యం తమ గ్రామంతో పాటు ఇతర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– సత్తయ్య, వెంకటరత్నాపూర్

రూ.24లక్షలతో పంచాయతీ భవనం

హవేళిఘణాపూర్(మెదక్): అద్దె భవనంలో కొనసాగుతూ ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి నూతన భవనాలను నిర్మించడం హర్షణీయమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాజ్‌పేట తండాలో రూ.24లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తండావాసులు ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్, కాంగ్రెస్ నాయకులు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

పోచారం డ్యాంపై ఆంక్షలు



పొంగిపొర్లుతున్న పోచారం అలుగు

- అలుగు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు
- పోలీసుల తీరుపై పర్యాటకుల ఆగ్రహం

హవేళిఘణాపూర్(మెదక్): ఎగువన కురుస్తున్న వర్షాలకు పోచారం డ్యాం నిండుకుండలా మారి పొంగిపొర్లుతోంది. ఈ అందాలను చూసేందుకు పర్యాటకులు ఆసక్తి కనబర్చడం సహజమే. వర్షాకాలంలో మత్తడిపై అలుగు వద్ద ప్రవహిస్తున్న నీటి అందాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. అయితే ఈ అందాలను వీక్షించకుండా పోలీసులు కిలోమీటరు పరిధి వరకు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి నిలిపివేశారు. దీం పర్యాటకులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా అధికారులు అవగాహన లోపం కారణంగా పొంగిపొర్లుతున్న అందాలను వీక్షించలేకపోతున్నామని పర్యాటకులు వాపోతున్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలను సైతం పోలీసులు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అధికారులు స్పందించి వెసులుబాటు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.



పోచారం డ్యామ్ వెళ్లే దారిలో పోలీసు చెక్‌పోస్టు

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం నుంచి కొంపల్లి వరకు రోడ్డు విస్తరణతో పాటు కొత్తపల్లి వంతెన వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు పాపన్నపేట నుంచి కొంపల్లి వరకు పది కిలోమీటర్ల సింగిల్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. అలాగే రోడ్డుపై చాలా మూలమలుపులు ఉండడంతో నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ మేరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే స్పందించినట్లు వారు తెలిపారు. దీంతో పాటు కొత్తపల్లి వంతెన వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణానికి సైతం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు ప్రశాంత్ రెడ్డి, బాబర్, డీలర్ శ్రీనివాస్ ఉన్నారు.

ఈత మొక్కలు పంపిణీ చేయాలి



ఈత మొక్కల నర్సరీని పరిశీలిస్తున్న నాయకులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కల్లుగీత సొసైటీలకు ప్రభుత్వం ఈత మొక్కలను పంపిణీ చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దాపూర్‌లోని నర్సరీలో పెంచుతున్న ఈత మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి సొసైటీకి భూమి ఇచ్చి ఈత మొక్కలను పంపిణీ చేస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను ప్రభుత్వం కొనుగోలు చేసి కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాలకు పంపిణీ చేయాలన్నారు. అలాగే, ప్రభుత్వ భూముల్లో, చెరువు కట్టలపైన రోడ్లకు ఇరువైపులా ప్రాజెక్టుల కట్టల కింద నాటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, నాయకులు జంగన్న గౌడ్, రమేష్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామాగౌడ్, జనార్దన్ గౌడ్, నవీన్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో రైతులకు భారం

జహీరాబాద్: ఎడతెరిపి లేని వర్షాలకు పంటలను కలుపు మొక్కలు కమ్మేశాయి. నియోజకవర్గంలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లోని పంటల్లో కలుపు మొక్కలు ఏపుగా పెరిగి వచ్చాయి. దీంతో కలుపు మొక్కలను తొలగించడం రైతులకు భారంగా మారింది. సోయాబీన్, మొక్కజొన్న, పత్తి, కంది, మినుము పంటల్లో కలుపు మొక్కలు అధికంగా వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు. అధిక వర్షాల వల్ల ఒక వైపు పంటలు దెబ్బతినగా, మిగిలిన పంటను దెబ్బతినకుండా ఉద్దేశంతో కలుపు మొక్కలను తొలగించుకుంటున్నట్లు చెబుతున్నారు.



సోయాబీన్‌లో కలుపు మొక్కలను తొలగిస్తున్న కూలీలు

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న లింగంగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ప్యాటగట్టకి చెందిన బీజేపీ కార్యకర్త గురుచరణ్ తల్లి మ్యాడబోయిన పోచమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు లింగంగౌడ్ పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సురేష్‌గౌడ్, బాబు, శ్రీను, శేఖర్, మహేష్, దశరంతం పాల్గొన్నారు.

మండపాల నిర్వాహకులకు అవగాహన



ఎస్‌ఐ రాజేశ్

నిజాంపేట(మెదక్): వినాయక నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వాహకులు పలు సూచనలు పాటించాలని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో వినాయక వివరాలను నమోదు చేసి పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలన్నారు. నవరాత్రులు వినాయక మండపం వద్ద ప్రతి ఒక్కరూ వలంటరీగా బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలన్నారు.

వినాయక మండపాలు రెడీ



కమలాపూర్‌లో సిద్ధమవుతున్న వినాయక మండపం

పెద్దశంకరంపేట(మెదక్): వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో వినాయక మండపాలు సిద్ధమవుతున్నాయి. ఆదివారం ఆయా గ్రామాల్లో నిర్వాహకులు మండపాలను సుందరంగా అలంకరిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, సౌండ్ పొల్యూషన్ లేకుండా చూసుకోవాలన్నారు. ఇక, నిమజ్జన సమయంలో చెరువుల వద్ద జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలంలోని ఎన్కెమూరి గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గారెడ్డి తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు శనివారం రాత్రి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద పట్టుబడిన రూ. 3100 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



గౌతాపూర్ పాఠశాలలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మదన్‌రెడ్డి, సుహాసినిరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకుని సాధనకు కృషి చేయాలని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌతాపూర్ గ్రామ శివారులో నిర్మించిన నూతన పాఠశాల భవనంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, సొంత నిధులతో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం కిషన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మదన్ రెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శేషసాయిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర, యూత్ నాయకుడు చిరంజీవి, ఎంఈఓ విఠల్, హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి ఘన నివాళి

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్రం కనీస వేతన సంఘం మాజీ చైర్మన్ దివంగత చిలుముల కిషన్‌రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ప్రజాప్రతినిధులు నాయకులు నివాళులర్పించారు. ఈ మేరకు కౌడిపల్లిలోని ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, అసెంబ్లీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, చిలప్‌చెడ్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శేషసాయిరెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం వద్ద సుహాసినిరెడ్డి బోర్ వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కిషన్‌రెడ్డి నిరంతరం పాటుపడ్డారని, అతని ఆశయసాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ చిన్నంరెడ్డి, గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రం కృష్ణాగౌడ్, నాయకులు శ్రీధర్ గుప్త, రాజుయాదవ్, నవీన్‌రావ్ పాల్గొన్నారు.

యూరియా కొరత.. బారులు తీరిన రైతులు



క్యూలో నిల్చున్న రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఆదివారం మండల కేంద్రంలోని భాగ్యలక్ష్మి ట్రేడర్స్‌కు 300బస్తాల యూరియా వచ్చింది. దీంతో విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి షాపు ఎదుట క్యూలో నిల్చున్నారు. అనంతరం వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులకు యూరియా పంపిణీ చేయగా.. చివరిలో కొంతమంది రైతులకు యూరియా అందలేదు. దీంతో యూరియా సమస్య తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు విమర్శలు చేశారు.

కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం

చేగుంట(తూప్రాన్): పంచాయతీ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. ఆదివారం కర్నాల్‌పల్లిలో గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ పంచాయతీల్లో కార్మికులుగా పనిచేస్తూ చాలీ చాలని వేతనాలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్మికులకు పనికి తగిన వేతనం అందించాలన్నారు. ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయని సమక్షంలో రాష్ట్ర మహాసభల్లో పంచాయతీ కార్మికుల సమస్యలే ఎజెండాగా మాట్లాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రవీణ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వనంలో గిరిజనుల పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): వలసలకు వెళ్లిన గిరిజనులు వనంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని శేరితండాలో గిరిజనులు ప్రతి ఏడాది వానాకాలంలో వలసలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగానే ఆదివారం గ్రామశివారులోని అటవీ ప్రాంతంలోకి వలసలకు వెళ్లి జగదాంభమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోగ్‌బండార్ నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రజలంతా పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు గిరిజనులు చెప్పారు.



పూజలు చేస్తున్న గిరిజనులు

వర్షాకాలంలో విద్యుత్‌తో జరభద్రం

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలు

- వ్యవసాయ పొలాల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- తడి చేతులతో స్టార్టర్లు, మోటార్లు పట్టుకోవద్దు

మెదక్ కలెక్టరేట్: వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ పొలాల్లో స్తంభాల వద్ద విద్యుత్ ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే రైతులు వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలను జాగ్రత్తగా పరిశీలించి ముందుకెళ్లాలి. వర్షాలతో రైతులు, ప్రజలకు, విద్యార్థులకు పొంచి ఉంది. ఈ మేరకు ముందస్తు విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించకుంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విద్యుత్‌పై జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో భద్రతా ప్రమాణాలు పాటించినట్లయితే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ షాక్, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగడానికి ఎక్కువగా అవకాశం ఉంటుంది. కావున తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలి.

ఎర్తింగ్ పరిశీలన ..

విద్యుత్ తీగలు తెగి పడితే వాటిని తాకకుండా సమీపంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి లేదా సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలి. ఇంటి ఆవరణలో ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. అదే సమయంలో ఎర్తింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. జిల్లాలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో దాబాలు, భవనాలపై విద్యుత్ లైన్లకు దగ్గరగా దుస్తులు ఆరవేయకూడదు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన, విద్యుత్ లైన్ల కింద తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు పెట్టడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. అలాగే రైతులు తడి చేతులతో స్టార్టర్లు, మోటార్లు పట్టుకోకూడదు. ప్రస్తుతం వర్షాకాలంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు తదితర విద్యుత్‌తో పని చేసే వస్తువులను వినియోగించకుండా నిలిపివేయడంతో పాటు ప్లగ్‌లను సైతం తొలగించాలి.



ఎస్ఈ, నారాయణ నాయక్

జాగ్రత్తలు తప్పనిసరి

వర్షం, తుఫాను వంటి సమయాల్లో విద్యుత్ సరఫరా లైన్లు ఉన్న ఏ నిర్మాణం కింద ఆశ్రయం పొందకూడదు. ఇళ్లు, వ్యాపార సంస్థలు, దుకాణాల్లో విద్యుత్‌కు సంబంధించిన అన్ని రకాల కనెక్షన్లు, ప్లగ్‌లు పరిశీలించుకోవాలి. రెగ్యులర్‌గా ఇళ్లు, వ్యాపార సంస్థలు, దుకాణాల్లో ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌తో అవసరమైన మరమ్మతులు చేసుకోవాలి. అదే సమయంలో ఎర్తింగ్ కూడా చెక్ చేసుకున్నట్లయితే ప్రమాదాలు జరగకుండా ఆస్కారం ఉంటుంది. విద్యుత్తు వినియోగదారులు ప్రతి ఒక్కరూ ఈ జాగ్రత్తలు పాటించినట్లయితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ నారాయణ నాయక్ తెలిపారు.

నేడు మంత్రి దామోదర రాక

టేక్మాల్(మెదక్): మండలంలోని బొద్మట్‌పల్లిలో సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు కోసం రోడ్డును పరిశీలించేందుకు సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మరమేష్ ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగానే 161 జాతీయ రహదారి అధికారులతో రోడ్డును పరిశీలించనున్నారు. అనంతరం ప్రజాభిప్రాయం ప్రకారం అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగేందుకు తగు చర్యలు తీసుకుంటారన్నారు. కాగా, మంత్రి ఉదయం 11గంటలకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.